క్లుప్తంగా

విద్యార్థులకు గ్లాస్‌లు అందజేత

తానూరు: మండలంలోని ఎల్వి జిల్లా పరిషత్ పాఠశాల విద్యార్థులకు గ్రామానికే చెందిన కవిత-దేవారెడ్డి దంపతులు సమకూర్చిన రూ.ఆరు వేల విలువైన గ్లాస్‌లను విరాళంగా అందించారు. ప్రధానోపాధ్యాయుడు భూమన్నయాదవ్ మాట్లాడుతూ కవిత-దేవారెడ్డి నిజామాబాద్ జిల్లాలో ప్రభుత్వ ఉపాధ్యాయులుగా పని చేస్తూ గ్రామంలోని పాఠశాలకు సాయం అందించడం అభినందనీయమన్నారు. యోగేశ్, ఉపాధ్యాయులు మాధవ్‌రావ్, సుదర్శన్, రమేశ్, నర్సయ్య, సుజాతదేవి, గంగారాణి, విద్యార్థుల పోషకులు ఉన్నారు.

ఎంఐఎం ఆవిర్భావ వేడుకలు



జెండా ఆవిష్కరణలో పాల్గొన్న నాయకులు

భైంసాటౌన్: పట్టణంలో గురువారం ఏఐఎంఐఎం పార్టీ ఆవిర్భావ వేడుకలను ఘనంగా నిర్వహించారు. పార్టీ కార్యాలయంలో మున్సిపల్ వైస్ చైర్మన్, పార్టీ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు మహ్మద్ జాబీర్ అహ్మద్ ఆధ్వర్యంలో పార్టీ జెండా ఆవిష్కరించారు. అనంతరం కేక్ కట్ చేసి సంబరాలు చేసుకున్నారు. కార్యక్రమంలో నాయకులు ఎండీ అమీర్, మాజిద్, ఇర్ఫాన్, మోబిన్, రాహుల్, తదితరులున్నారు.

ఆత్మస్థైర్యంతో ముందుకెళ్లాలి

లోకేశ్వరం: మహిళలు అన్ని రంగాల్లో రాణిస్తూ ఆత్మస్థైర్యంతో ముందుకెళ్లాలని ముధోల్ ఐసీడీఎస్ సీడీపీవో శ్రీమతి అన్నారు. మహిళా దినోత్సవం పురస్కరించుకొని గురువారం లోకేశ్వరం అంగన్‌వాడీ కేంద్రంలో కిశోర బాలికలకు, మహిళలకు నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు. లింగ సమానత్వం, మహిళా చట్టాలు, బాల్య వివాహాలపై అవగాహన కల్పించారు. సర్పంచ్ సౌజన్య, సూపర్‌వైజర్ శ్రీలక్ష్మి, సునీత, సురేఖ పాల్గొన్నారు.

బీజేపీ నాయకుల సంబురాలు



సంబురాలు చేసుకుంటున్న నాయకులు

నిర్మల్‌చైన్‌గేట్: ఈశాన్య రాష్ట్రాల్లో బీజేపీ మెజార్టీ సీట్లు సాధించడంపై ఆ పార్టీ జిల్లా నాయకులు హర్షం వ్యక్తం చేశారు. గురువారం జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయం ఎదుట టపాసులు కాల్చి మిఠాయిలు పంచిపెట్టారు. నాయకులు మాట్లాడుతూ మోదీ అభివృద్ధిని చూసే ఈశాన్య ప్రజలు బీజేపీకి పట్టం కట్టారన్నారు. త్వరలో తెలుగు రాష్ట్రాల్లోనూ బీజేపీ జెండా ఎగరవేస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

విగ్రహ ప్రతిష్ఠాపన



ఊరేగింపు వేడుకలో మహిళలు

కుంటాల: మండలంలోని అందకూర్‌లో మహాలక్ష్మీ, ముత్యాలమ్మ, చిలుకల చిన్నమ్మ, బద్దిపోచమ్మ, అరెల్లి మైసమ్మ, ఐదు చేతుల పోచమ్మ, అడెల్లి పోచమ్మ విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవం గురువారం ఘనంగా ప్రారంభమైంది. మహిళలు మంగళహారతులు, శివసత్తుల పూనకాల నడుమ ప్రతిమలను ఊరేగించి ఆలయానికి తీసుకెళ్లారు. ఆలయ కమిటీ సభ్యులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

మొత్తం పంట కొనాలని వినతి



కలెక్టర్‌కు వినతిపత్రం అందిస్తున్న నేతలు

నిర్మల్‌చైన్‌గేట్: శనగ పంట మొత్తం ప్రభుత్వమే కొనుగోలు చేయాలని బీజేపీ రాష్ట్ర నాయకులు భోస్లే మోహన్‌రావు పాటిల్ అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్‌లో ముధోల్ నియోజకవర్గంలోని రైతుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ కలెక్టర్ వరుణ్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వం పీఏసీఎస్‌ల ద్వారా ఎకరాకు కేవలం ఐదు క్వింటాళ్ల శనగ పంటను మాత్రమే సేకరిస్తుందన్నారు. ఈసారి ఎకరాకు తొమ్మిది క్వింటాళ్ల వరకు దిగుబడి వచ్చిందన్నారు. ఐదు క్వింటాళ్లే కొనడంతో మిగతా పంటను రైతులు దళారులకు తక్కువ రేటుకు అమ్ముకుంటున్నారని వివరించారు.

శిబిరం వద్దే అంగన్‌వాడీల నిద్ర

నిర్మల్‌చైన్‌గేట్: తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ ఎదుట అంగన్‌వాడీలు చేపట్టిన 36 గంటల దీక్ష గురువారం రాత్రి పది గంటల వరకు కూడా కొనసాగింది. శిబిరం వద్దనే నిద్ర చేశారు.

జోరుగా యాసంగి సాగు

- సదర్మాట్ కాల్వకు మరమ్మతులు చేయడంతో ఆలస్యమైన పనులు
- ఈసారైనా దిగబడులు వస్తాయనే ఆశతో రైతులు
- సస్యరక్షణ చర్యలు పాటించాలంటున్న వ్యవసాయశాఖ



ఖానాపూర్‌లో ఇటీవల నాటు వేసిన వరి పొలం

ఖానాపూర్: వానాకాలంలో అధిక వర్షాలతో పంటలు నష్టపోయిన రైతులు కాస్త ఆలస్యంగానైనా యాసంగి సాగు పనులు జోరుగా చేపట్టారు. ఖానాపూర్, కడెం, పెంబి, దస్తురాబాద్ మండలాల్లోని రైతులు సదర్మాట్ కాలువ, డీ-27, డీ-28 కాలువలతోపాటు చెరువులు, కుంటలను నమ్ముకొని పంటలు సాగు చేస్తున్నారు. వర్షాకాలంలో ఖానాపూర్ మండలం పాతఎల్లాపూర్ వద్ద సదర్మాట్ ప్రధాన కాల్వ దెబ్బతింది. దీంతో కడెం, దస్తురాబాద్ మండలాల్లోని చాలా మంది రైతులు తమ భూములను బీళ్లుగానే వదిలేశారు. ఇటీవల పాతఎల్లాపూర్ వద్ద కాలువకు అధికారులు తాత్కాలిక మరమ్మతులు చేపట్టడంతో పంటలు సాగు చేస్తున్నారు. ఈ యాసంగిలో సదర్మాట్ ఆయకట్టు పరిధిలో సుమారు 15వేల ఎకరాల్లో రైతులు పంటలను సాగు చేశారు. ఇందులో 70శాతం వరి కాగా.. మిగతా భాగం మొక్కజొన్న, నువ్వులు, ఆవాలు, శనగ పంటలు పండిస్తున్నారు. కొందరు రైతులు విద్యుత్ మోటార్లు, బోర్ల కింద పంటలను పండిస్తున్నారు.

నాలుగు మండలాల్లో సాగు వివరాలు..

ఖానాపూర్ మండలంలో 8,320 ఎకరాల్లో వరి, 12 ఎకరాల్లో జొన్న, 1,226 ఎకరాల్లో మొక్కజొన్న, 27 ఎకరాల్లో ఆవాలు, 1,150 ఎకరాల్లో నువ్వులు, 70 ఎకరాల్లో ఇతర పంటలను సాగు చేస్తున్నారు. కడెంలో 9,600 ఎకరాల్లో వరి, జొన్న 18 ఎకరాలు, మొక్కజొన్న 1,560 ఎకరాలు, ఆవాలు 20 ఎకరాలు, నువ్వులు 2,10 ఎకరాలు, 85 ఎకరాల్లో ఇతర పంటలు సాగు చేస్తున్నారు. దస్తురాబాద్ మండలంలో వరి 11వేల ఎకరాలు, జొన్న 10 ఎకరాలు, మొక్కజొన్న 850, ఆవాలు 8, నువ్వులు 115, ఇతర పంటలు 50 ఎకరాల్లో సాగు చేస్తున్నారు. పెంబి మండలంలో వరి 876 ఎకరాలు, జొన్న 475 ఎకరాలు, మొక్కజొన్న 2,215 ఎకరాలు, ఆవాలు 8 ఎకరాలు, నువ్వులు 270 ఎకరాలు, ఇతర పంటలు 60 ఎకరాల్లో సాగు చేస్తున్నారు.

దిగుబడిపైనే దిగాలు..

వర్షాకాలంలో అధిక వర్షాలతో నష్టపోయిన రైతులు యాసంగిలో వచ్చే పంట దిగుబడిపైనే దిగాలుతో ఉన్నారు. వానాకాలం నష్టాన్ని పూడ్చేందుకు యాసంగిలో అప్పులు చేసి సైతం పెట్టుబడులు పెట్టారు. అధిక కూలీ రేట్లు, డీజిల్, ఎరువులు, పురుగు మందుల ధరలు పెట్టుబడి పెరుగుదలకు కారణమయ్యాయి. ఈ క్రమంలో పంటకు ప్రభుత్వం కనీస మద్దతు ధర ప్రకటిస్తే తప్ప తమ కష్టాలు తీరేలా లేవని రైతులు పేర్కొంటున్నారు.

ఇష్టానుసారం పిచికారీ చేయవద్దు..

- రైతులు ఇష్టానుసారం పురుగు మందులు, ఎరువులు వినియోగించకుండా వ్యవసాయాధికారుల సూచనలు పాటించాలి.
- వరి సాగులో కాంప్లెక్స్ ఎరువుల కంటే సూటి ఎరువులు వినియోగిస్తే సత్ఫలితాలు బాగుంటాయని వ్యవసాయాధికారులు పేర్కొన్నారు.
- వరినాట్లు వేసినప్పటి నుంచి పంట కోతకు వచ్చే వరకు నత్రజని, భాస్వరం, పొటాష్ ఎరువులను సరిపడ మోతాదులో వినియోగించాలి.
- కాంప్లెక్స్ ఎరువుల వినియోగంతో రైతుపై అధిక భారం పడి పంటకు హాని కలుగుతుంది.

పెట్టుబడి పెరిగింది



వానాకాలంలో అధిక వర్షాల కారణంగా పంటపొలంలో ఇసుక మేటలు వేసి తీవ్రంగా నష్టపోయా. యాసంగిలో కూలీ ధరలు, కేజీవీల్స్, విత్తనాలు, ఎరువుల ధరలు పెరగడంతో పెట్టుబడి అధికమైంది. మంచి దిగుబడులు వచ్చి పంటకు మద్దతు ధర లేకపోతే రైతులు నష్టపోయే ప్రమాదం ఉంది.
– మల్లేశ్, ఖానాపూర్

సూచనలు పాటించాలి



రైతులు సమతుల్య ఎరువులు వాడడం ద్వారా వరిలో అధిక దిగుబడి సాధించవచ్చు. అధికారుల సూచనల మేరకే ఎరువులను తగు మోతాదులో వాడాలి. పంట సాగులో సలహాలు, సూచనలు అవసరమయ్యే రైతులు స్థానిక కార్యాలయంలో సంప్రదించాలి. సూటి ఎరువుల వాడకంతో సాగుభారం తగ్గి పంటకు, నేలకు మేలు జరుగుతుంది.
– ఆసం రవి, ఏవో, ఖానాపూర్

అటెన్షన్ ప్లీజ్.. వినియోగంలోకి తేరూ..



లక్ష్మణచాంద: మండలంలోని చింతల్‌చాందలో ప్రజల సౌకర్యార్థం నిర్మించిన దోభీఘాట్ చుట్టూ ముళ్లపొదలు పెరిగి నిరుపయోగంగా మారింది. ఇక్కడున్న బోర్ పనిచేయడం లేదు. అధికారులు మరమ్మతులు చేయించి దోభీఘాట్‌ను వినియోగంలోకి తేవాలని గ్రామస్తులు కోరుతున్నారు.
ప్రశ్నించాల్సిన అధికారి: నసీరుద్దీన్, ఎంపీవో, ఫోన్: 7989208402

నేడు ధర్నా

కుంటాల: బీజేపీ ప్రభుత్వం గ్యాస్ సిలిండర్ ధరలను పెంచడాన్ని బీఆర్‌ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు, ముధోల్ ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి ఆదేశాల మేరకు శుక్రవారం ఉదయం తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహిస్తున్నట్లు ఆ పార్టీ మండల కన్వీనర్ పడకంటి దత్తాత్రి ఒక ప్రకటనలో తెలిపారు.

లక్ష్మణచాంద: మంత్రి ఐకేరెడ్డి ఆదేశాల మేరకు మండల కేంద్రంలో చేపట్టే ధర్నా విజయవంతం చేయాలని బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు క్రిష్ణారెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజాప్రతినిధులు, నాయకులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

సారంగపూర్: మండల కేంద్రంలో బీఆర్‌ఎస్ ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించే ధర్నాను విజయవంతం చేయాలని ఆ పార్టీ మండల కన్వీనర్ మాధవరావు తెలిపారు. పార్టీ కార్యకర్తలు, ఉదయం 9:30 గంటలకు పార్టీ కార్యాలయానికి రావాలని కోరారు.

రైతుబజార్‌లో..

కూరగాయలు	కిలో(రూ.లో)
టమాటా	20
వంకాయ	50
బెండకాయ	40
పచ్చిమిర్చి	60
కాకరకాయ	50
బీరకాయ	70
క్యారెట్	80
గోరుచిక్కుడు	60
కొత్తిమీర	100
అల్లం	50
ఎల్లిగడ్డ	60
ఉల్లిగడ్డ	20
ఆలుగడ్డ	20

- నిర్మల్‌టౌన్

రాగిజావ పంపిణీ

కడెం: మండల కేంద్రంలోని ఎమ్మార్సీ కార్యాలయంలో గురువారం ఉపాధ్యాయులకు సత్యసాయి అన్నపూర్ణ ట్రస్ట్ సభ్యులు రాగిజావ ప్యాకెట్లు పంపిణీ చేశారు. మండలంలోని ప్రభుత్వం ప్రాథమిక పాఠశాలల విద్యార్థులకు శుక్రవారం నుంచి రాగిజావ పంపిణీ చేస్తామని కార్యాలయ సిబ్బంది తెలిపారు. ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయ సంఘ జిల్లా ప్రధాన కార్యదర్శి రాజేశ్‌నాయక్, సీఆర్పీలు సోలమన్, తిరుపతి, రాజేందర్, లింగన్న ఉన్నారు.

సినిమాలు



తిరుమల : సార్
నారాయణ: బలగం

సన్మానం

కుంటాల: కుంటాల పీఆర్ ఏఈ సూర్యతేజ ఇటీవల బదిలీపై వెళ్లారు. లోకేశ్వరం ఏఈగా పనిచేస్తున్న రఘు వంశీ కుంటాల ఇన్‌చార్జి ఏఈగా బాధ్యతలు స్వీకరించారు. కాగా ఇరువురిని గురువారం మండల పరిషత్తు కార్యాలయంలో సన్మానించారు. ఎంపీపీ గజ్జారాం, ఎంపీడీవో దేవేందర్‌రెడ్డి, ఎంపీవో రహీం, సుధాకర్, అన్నపూర్ణ పాల్గొన్నారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు

- ముధోల్ ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి



చెక్కు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే విఠల్ రెడ్డి

తానూరు: రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెడుతున్న సంక్షేమ పథకాలను అర్హులందరికీ అందేలా చూస్తామని ముధోల్ ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి అన్నారు. గురువారం మండలకేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో 29 మంది లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులు పంపిణీ చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలో ఎక్కడ లేని విధంగా తెలంగాణ ప్రభుత్వం అన్ని వర్గాల ప్రజల సంక్షేమానికి కృషి చేస్తోందన్నారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ చంద్రకాంత్, తహసీల్దార్ వెంకటరమణ, ఎంపీడీవో శ్రీనివాస్, చంద్రకాంత్ యాదవ్, రాజన్న, పోతారెడ్డి, పలువురు సర్పంచ్‌లు, ఎంపీటీసీలు తదితరులు పాల్గొన్నారు.

సీసీ రోడ్డు పనులు ప్రారంభం..

మండలంలోని ఎల్వత్‌లో సీసీ రోడ్డు నిర్మాణానికి ఉపాధి నిధులు రూ.17 లక్షలు మంజూరవగా.. ఎమ్మెల్యే పనులు ప్రారంభించారు. చంద్రశేఖర్, కమలాకర్, బాబురావ్ తదితరులు పాల్గొన్నారు.

పంచాయతీ నిర్మాణానికి భూమిపూజ

ముధోల్: మండలంలోని బ్రహ్మన్‌గావ్ గ్రామంలో రూ.20లక్షలతో నిర్మించే పంచాయతీ భవనానికి ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి గురువారం భూమిపూజ చేశారు. బీఆర్‌ఎస్ మండలాధ్యక్షుడు ఆఫ్రోజ్‌ఖాన్, ఎంపీటీసీ సునీత పోశెట్టి, సురేందర్‌రెడ్డి, గంగాధర్, కిష్టయ్య, గౌతమ్ తదితరులు ఉన్నారు.

బీఆర్‌ఎస్‌తోనే అభివృద్ధి సాధ్యం

- ఖానాపూర్ ఎమ్మెల్యే రేఖానాయక్



కుట్టుమిషన్ అందిస్తున్న ఎమ్మెల్యే రేఖానాయక్

కడెం: బీఆర్‌ఎస్ పార్టీతోనే గ్రామాల్లో అభివృద్ధి సాధ్యమని ఎమ్మెల్యే రేఖానాయక్ అన్నారు. గురువారం మండలంలోని ఎలగడప, ధర్మాజీపేట్, పెద్ద బెల్లాల్, లక్ష్మీపూర్, ఉడుంపూర్ గ్రామాల్లో పర్యటించారు. ఈసందర్భంగా లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి చెక్కులు పంపిణీ చేసి.. సీసీ రోడ్ల నిర్మాణ పనులను ప్రారంభించారు. మండలంలోని కొండుకూర్ ఫంక్షన్‌హాల్‌లో కుట్టుమిషన్ శిక్షణ పొందిన ఎస్సీ యువతులు, మహిళలకు కుట్టుమిషన్లు అందించారు. అంతకుముందు గ్యాస్ సిలిండర్ ధరల పెంపును నిరసిస్తూ మండల కేంద్రంలో రోడ్డుపై నిర్వహించిన ధర్నాలో పాల్గొన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ శ్రీనివాస్‌రెడ్డి, జెడ్పీ కోఆప్షన్ సభ్యులు రఫీక్ అహ్మద్, ఆత్మ కమిటీ చైర్మన్ సతీశ్, బీఆర్‌ఎస్ మండలాధ్యక్షుడు చంద్రశేఖర్, రైతుబంధు సమితి మండల కన్వీనర్ జీవన్‌రెడ్డి, మంగ, సర్పంచ్‌లు సత్తెమ్మ, రమాదేవి, విజయ, లక్ష్మి, వేణుగోపాల్, గంగన్న, వెంకటేశ్, నాయకులు రాజేశ్వర్‌గౌడ్, వేణుగోపాల్, తదితరులు ఉన్నారు.

అందుబాటులో యూరియా

లోకేశ్వరం: మండల కేంద్రంలోని పీఏసీఎస్ కార్యాలయంలో యూరియా అందుబాటులో ఉందని పీఏసీఎస్ చైర్మన్ రత్నాకర్‌రావు ఒక ప్రకటనలో తెలిపారు. బస్తా ధర రూ.270 అని.. ఆసక్తి కల్గిన రైతులు శుక్రవారం ఉదయం ఆధార్, పట్టాదార్ పాస్‌పుస్తకం జిరాక్స్‌లతో కార్యాలయంలో సంప్రదించాలని సూచించారు.

భూమిపూజ

కుంటాల: మన ఊరు-మన బడిలో భాగంగా మండలంలోని ఓలా ప్రాథమిక పాఠశాలలో ప్రహరీ నిర్మించేందుకు ప్రభుత్వం రూ.11లక్షలు మంజూరు చేసింది. ఈ మేరకు గురువారం భూమిపూజ చేసి పనులను సర్పంచ్ కనీశ్ ఫాతిమా ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంపీడీవో దేవేందర్‌రెడ్డి, ఆర్‌అండ్‌బీ ఏఈ రఘు, తదితరులు పాల్గొన్నారు.

డ్రైనేజీ పనులు ప్రారంభం

లోకేశ్వరం: మండలంలోని గొడిసెరా గ్రామంలో డ్రైనేజీ పనులను, కిష్టాపూర్ గ్రామంలో సీసీ రోడ్డు పనులను జెడ్పీ మాజీ చైర్మన్ లోలం శ్యాంసుందర్ గురువారం ప్రారంభించారు. ఎంపీటీసీ దత్తురాంపటేల్, సర్పంచ్‌లు భోజవ్వ, శైలజ, పీఏసీఎస్ చైర్మన్ రత్నాకర్‌రావు, భోజన్న, గంగాధర్, గణపతిరెడ్డి పాల్గొన్నారు.

నర్సరీల్లో షేడ్‌నెట్ ఏర్పాటు చేయాలి



లోకేశ్వరం: మాట్లాడుతున్న ఎంపీడీవో సల్మాన్‌రాజ్

లోకేశ్వరం: వేసవి సమీపిస్తున్నందున గ్రామాల్లో నర్సరీలకు షేడ్‌నెట్‌లు ఏర్పాటు చేయాలని ఎంపీడీవో సల్మాన్‌రాజ్ అన్నారు. గురువారం మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు, ఉపాధిహామీ సిబ్బందికి నిర్వహించిన సమావేశంలో ఎంపీడీవో మాట్లాడారు. మొక్కలు ఎండిపోకుండా నీటిని అందించడం తోపాటు ప్రతి పంచాయతీలో వందశాతం ఇంటి పన్నులు వసూలు చేయాలన్నారు. పని ప్రదేశంలో ఉపాధి కూలీలకు సౌకర్యాలు కల్పించాలని సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో ఏపీవో జగన్నాథ్, పీఆర్ ఏఈ రఘువంశీ, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ శ్రీనివాస్, ఈసీ అనిల్ ఉన్నారు.

మొక్కలు ఎండిపోకుండా చూడాలి

దస్తురాబాద్: వేసవిలో మొక్కలు ఎండిపోకుండా ఎప్పటికప్పుడు నీటిని అందించాలని ఎంపీడీవో వేంకటేశ్వర్లు సిబ్బందికి సూచించారు. గురువారం మండలంలోని రేవోజీపేట, బుట్టపూర్ గ్రామాల్లో డంపింగ్‌యార్డ్, నర్సరీలను పరిశీలించారు. కార్యక్రమంలో ఎంపీవో అనిల్, సర్పంచ్ సుజాత, తదితరులు పాల్గొన్నారు.

పరామర్శ

దస్తురాబాద్: మండలంలోని భూత్కూర్ పంచాయతీ పరిధిలోని రాంపూర్‌కు చెందిన బుస లింగన్న, బురె నర్సయ్య అనారోగ్యంతో మృతి చెందారు. గురువారం బాధిత కుటుంబాలను గ్రీన్‌ఇండియా చాలెంజ్ డైరెక్టర్ బాదవత్ పూర్ణచందర్‌నాయక్ పరామర్శించి రూ.ఐదు వేల ఆర్థికసాయం అందించారు. అనంతరం రేవోజీపేటలో బీఆర్‌ఎస్ కార్యకర్త మైదం శ్రీశైలం కుటుంబాన్ని పరామర్శించారు. అంగవైకల్యంతో బాధపడుతున్న మైదం వెంకటేశ్‌కు ట్రై సైకిల్ అందిస్తానని భరోసానిచ్చారు. వారి వెంట నాయకులు ఉన్నారు.

ఉన్నత చదువులతోనే భవిష్యత్

- తహసీల్దార్ ఆరిఫా సుల్తానా
- సివిల్ సప్లయ్ డీఎంతో కలిసి మామడ జెడ్పీ ఉన్నత పాఠశాల తనిఖీ



విద్యార్థులతో భోజనం చేస్తున్న తహసీల్దార్

మామడ : ఉన్నత చదువులతోనే ఉత్తమ భవిష్యత్ ఉంటుందని.. పదో తరగతి విద్యార్థులు సమయం వృథా చేయకుండా పట్టుదలతో చదవాలని తహసీల్దార్ ఆరిఫా సుల్తానా అన్నారు. గురువారం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను వారు సివిల్ సప్లయ్ డీఎం శ్రీకళతో కలిసి తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వార్షిక పరీక్షలకు సిద్ధమవుతున్న పదో తరగతి విద్యార్థులకు పలు సూచనలు చేశారు. వారిని పరీక్షలకు ఎలా సిద్ధం చేస్తున్నారో ఉపాధ్యాయులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం మధ్యాహ్న భోజనం పరిశీలించి విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. నాణ్యమైన భోజనం అందించాలని సిబ్బందికి సూచించారు.

సాయిబాబా ఆలయంలో పూజలు

నిర్మల్‌టౌన్: పట్టణ శివారులోని గండి రామన్న క్షేత్రంలో కొలువుదీరిన సాయిబాబా ఆలయంలో గురువారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. చుట్టుపక్కల గ్రామాల భక్తులు భారీగా తరలివచ్చారు. గురువారం అన్నదాతగా నిలిచిన జిల్లా అటవీశాఖ అధికారి సునీల్ హిరమత్ దంపతులను ఆలయ చైర్మన్ లక్కడి జగన్‌రెడ్డి శాలువాతో సన్మానించారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదం అందజేశారు.

కల్లూర్‌లో..

కుంటాల: రెండో షిరిడీగా ప్రసిద్ధి చెందిన మండలంలోని కల్లూర్ సాయిబాబా ఆలయంలో గురువారం భక్తుల సందడి కనిపించింది. లోకేశ్వరం, భైంసా, నర్సాపూర్(జి), దిలావర్‌పూర్, కుంటాల మండలాల మహిళలు పాదయాత్రగా ఆలయానికి చేరుకున్నారు. బాబాను దర్శించుకొని మొక్కులు తీర్చుకున్నారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు అన్నదానం చేశారు.

'కళాశాల గుర్తింపును రద్దు చేయాలి'



ప్రభుత్వ దిష్టిబొమ్మ దహనం చేస్తున్న నాయకులు

భైంసాటౌన్: విద్యార్థి ఆత్మహత్యకు కారణమైన కార్పొరేట్ కళాశాల గుర్తింపును ప్రభుత్వం వెంటనే రద్దు చేయాలని ఏబీవీపీ నాయకులు డిమాండ్ చేశారు. ఈమేరకు గురువారం పట్టణంలోని భగత్ సింగ్‌చౌక్‌లో రాష్ట్ర ప్రభుత్వ దిష్టిబొమ్మ దహనం చేశారు. అనంతరం ఇందూర్ విభాగ్ ఎస్ఎఫ్‌డీ కన్వీనర్ గంగాప్రసాద్ మాట్లాడారు. నార్సింగిలోని శ్రీ చైతన్య కళాశాల ప్రిన్సిపాల్ వేధింపులు తాళలేక ఇంటర్ విద్యార్థి సాత్విక్ ఆత్మహత్య చేసుకున్నాడని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఏబీవీపీ నగర ఉపాధ్యక్షులు చంద్రకాంత్, కార్యదర్శి యోగేశ్, కిశోర్ తదితరులు ఉన్నారు.

'కంటివెలుగు' సద్వినియోగం చేసుకోవాలి



కమిషనర్‌కు సమస్యలు చెబుతున్న పాఠకులు

ఖానాపూర్: కంటివెలుగు శిబిరం సద్వినియోగం చేసుకోవాలని మున్సిపల్ కాంగ్రెస్ ఫ్లోర్‌లీడర్ చిన్నం సత్యం, అమానుల్లాఖాన్ అన్నారు. పట్టణంలోని ఆరో వార్డు పరిధి ఉర్దూభవన్‌లో నిర్వహిస్తున్న కంటివెలుగు శిబిరాన్ని వారు సందర్శించారు. కిశోర్ నాయక్, హైమద్, సంతోశ్, ఇమ్రాన్ ఉన్నారు.

భైంసా మున్సిపల్ కమిషనర్ పరిశీలన..

భైంసాటౌన్: పట్టణంలోని ఐదోవార్డు పరిధి అటవీశాఖ కార్యాలయ ఆవరణలో నిర్వహిస్తున్న కంటి వెలుగు శిబిరాన్ని మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్‌రావు గురువారం పరిశీలించారు. అనంతరం అటవీశాఖ కార్యాలయం పక్కనున్న గ్రంథాలయం సందర్శించారు. గ్రంథాలయంలో మరుగుదొడ్లు లేక ఇబ్బంది పడుతున్నామని పాఠకులు ఆయన దృష్టికి తీసుకెళ్లగా పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. మెప్మా సిబ్బంది దత్తు ఉన్నారు.

లక్ష్మణచాంద: మండలంలోని చింతల్‌చాందలో గురువారం పలువురు కంటి పరీక్షలు చేసుకోగా అవసరమైన వారికి కంటి అద్దాలు పంపిణీ చేశారు. వైద్యులు శ్రీకాంత్, శ్వేత, లక్ష్మణ్, సిబ్బంది శివకృష్ణ, యాస్మిన్, తదితరులు పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి

ఖానాపూర్: సైబర్‌నేరాలపై ప్రజలు అప్రమత్త ంగా ఉండాలని ఏఎస్సై రాంచందర్ అ న్నారు. గురువారం ఉదయం పట్టణ పార్క్ వద్ద వ్యాయామం కోసం వచ్చిన ప్రజలకు ఆయన అవగాహన కల్పించారు. అపరిచితుల నుంచి సెల్‌ఫోన్‌కు వచ్చే లింకులు, మెసేజ్‌లను ఎవరూ ఓపెన్ చేయవద్దని సూచించారు. ఫోన్ చేసి ఓటీపీ అడిగినా చెప్పవద్దన్నారు. సిబ్బంది రాజేశ్వర్, రవి, నరేశ్ ఉన్నారు.